## • అస్తవ్యస్తంగా పారిశుధ్యం

నార్నూర్ మండలం కొత్తపల్లి(హెచ్) గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. వీధుల్లోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పారిశుధ్యంపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

-నార్నూర్, మార్చి 1

మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికతీత, నిలిచిన నీరు

## వివేకానంద స్ఫూర్తితో జీవనాన్ని కొనసాగించాలి

విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1 : స్వామి వివేకానంద స్ఫూర్తితో జీవనాన్ని కొనసాగించే వారికి ఎప్పుడు విజయాలు వరిస్తాయని, తనకు కూడా వివేకానందనే స్ఫూర్తి అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విజేతలకు మహాలక్ష్మి వాడ పాఠశాలలో ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త బజరంగ్ లాల్ అగర్వాల్, సమితి సభ్యులతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## సిరికొండ ఇన్‌చార్జి ఏపీవోగా భీంరావ్

భీంరావ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 1 : ఉపాధి హామీ సిరికొండ మండల ఏపీవోగా జాదవ్ భీంరావ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇక్కడ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు సీనియర్ ఉపాధి హామీ టీఏ శేషారావ్ ఏపీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈసీలను ఇన్‌చార్జి ఏపీవోగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు రావడంతో ఈసీ భీంరావ్‌ను ఇన్‌చార్జి ఏపీవోగా నియమించడం జరిగిందని ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. భీంరావ్‌ను ఉపాధి సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 10461 విద్యార్థులకు గాను 9810 మంది పరీక్షకు హాజరయ్యారు. 651 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీంద్రకుమార్ పేర్కొన్నారు.

# ప్రజాపాలన సేవ కేంద్రాలను నెలకొల్పాలి

• ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

ఎదులాపురం, మార్చి 1 : వివిధ వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తాతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో కలిసి సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులందరూ ప్రయోజనం పొందేలా అన్ని మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసుల్లో సత్వరమే ప్రజాపాలన సేవ కేంద్రాలు నెలకొల్పాలని ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు దరఖాస్తుల్లో సరైన వివరాలు నమోదు చేయని వారి కోసం ప్రజాపాలన సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు లేనందున అలాంటి చోట తహసీల్ కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సోమవారం నాటికి అన్ని చోట్ల సేవ కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పని తీరు ప్రారంభం కావాలన్నారు. కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవ కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు.

### పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు, త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏ చిన్న తప్పిదాలు, అవాంఛనీయ ఘటనలకు సైతం తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పరీక్షా కేంద్రాలలోకి సెల్‌ఫోన్లను అనుమతించ కూడదని, కాఫీయింగ్‌కు అస్కారం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌష్‌ఆలం, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈవో ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, మార్చి 1: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని 6వ వార్డులో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని పది సంవత్సరాల్లో చాలా అభివృద్ధి చేశామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ముమ్ముందు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, డైరెక్టర్ ఉమేశ్, బొడ్డు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, మాజీ వార్డు సభ్యులు మచ్చేందర్, ఎంపీటీసీ మహిపాల్, తుకారాం, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ముబీన్, బాబుసింగ్, రాములు, మేడిపల్లి శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆధార్ కొత్త సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గజిటెడ్ నంబర్-2లో జిల్లాలోని అన్ని మండలాల ఎంఐఎస్, సీసీవోలకు శుక్రవారం ఆధార్ యొక్క కొత్త సాఫ్ట్‌వేర్, ఇతర కంప్యూటర్ సంబంధిత సాఫ్ట్‌వేర్ల గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ఆధార్ టెక్నికల్ పర్సన్ ప్రవీణ్ హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి టీ ప్రణీత పరిశీలించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మమత, ఏపీవో సందీప్, టెక్నికల్ పర్సన్ సలీం, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

## ప్లంబర్ కార్మిక సమస్యల కోసం పోరాడాలి

ఎదులాపురం, మార్చి 1 : ప్లంబర్ కార్మికులు తమ సమస్యలపై పోరాడి హక్కులు సాధించాలని ప్లంబర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం భవన్‌లో ప్రగతిశీల భవన కార్మిక అనుబంధ ప్లంబర్ సంఘం సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి వచ్చే పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీన పనులు బంద్ చేయాలన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చిన సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శేషారావ్, ప్రధానకార్యదర్శి దేవీదాస్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్, జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తు, అఖిల్, సంజయ్, రమాకాంత్, కమిటీ సభ్యులు రాజు, సంతోష్, సీతారం తదితరులు పాల్గొన్నారు.

## శనగ కొనుగోలుకు ఏర్పాటు పూర్తి చేయాలి

ఎదులాపురం, మార్చి 1 : జిల్లాలో తొమ్మిది శనగ కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులను సూచించారు. శుక్రవారం మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో శనగల కొనుగోలుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్, జైనథ్, తాంసి, బేల, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్‌లో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని రైతులు శనగ పంటను ప్రభుత్వ మద్దతు ధర రూ.5440 క్వింటాల్ కంటే తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా శనగను శుభ్రపర్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. త్వరలో శనగలు కొనుగోలు ప్రారంభ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.

## మాలీల ఎస్టీ హోదాపై స్పందించాలి

తాంసి(తలమడుగు), మార్చి 1: ఆదిలాబాద్‌కు ఈ నెల 4వ తేదీన రానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాలీల ఎస్టీ హోదా బిల్లుపై స్పందించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా ఆంధ్రలో ఎస్టీలుగా, తెలంగాణలో బీసీలుగా ఉన్న మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని అనేక ఉద్యమాలు చేశామని తెలిపారు. గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం పాస్ చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందని అన్నారు. కేంద్రం వద్ద ఆ బిల్లు పెండింగ్‌లో ఉందని విమర్శించారు. రాబోయే ఎన్నికల లోపు కేంద్రం ఆమోదించాలని కోరారు.

## నేడు ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10.30 గంటలకు ది టైమ్స్ ప్రో వారి సహకారంతో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభాత్‌రావ్, టీఎస్‌కేసీ మెంబర్ చైతన్య కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్, ఐసీఐసీఐ, యూనిటీ స్మాల్ ఫైనాన్స్, ఎస్ బ్యాంకు, డెలివరీ అండ్ ఫ్లిప్‌కార్ట్ కంపెనీల్లో శాశ్వత ప్రాతిపదికన బ్యాంకుల్లో నెలకు రూ.20 వేలు జీతభత్యాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, బీటెక్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండి, 1996-2003 మధ్య జన్మించి 27 సంవత్సరాల లోపు గల వారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8106764653 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇంద్రవెల్లి, మార్చి1 : శంకర్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొబ్బరిగూడలో రూ.7లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగోరావ్, ఆత్రం ఆశోక్, జంగు, రాము పాల్గొన్నారు.

## మాంగ్ సమాజ్ కార్యవర్గం ఎన్నిక

నార్నూర్, మార్చి 1 : గాదిగూడలో మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పరశురాం, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్ అధ్యక్షతన శుక్రవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కాంబ్లేనాగ్‌నాథ్, ఉపాధ్యక్షుడిగా గాయక్వాడ్ పండరి, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే ధన్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా భట్లాడే బాలాజీ, కోశాధికారిగా శివాజీ, సలహాదారులుగా మోరే కిషన్, మురహరి, సభ్యులుగా కాంబ్లే బాలాజీ, నాందేవ్, రాంకిషన్, ప్రహ్లాద్, తులసీదాస్, కాంబ్లే శేఖర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో దయానంద్, అనిల్, గోవింద్, సంజీవ్, దిగంబర్, సమాజ్ పెద్దలు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయండి

ఉట్నూర్, మార్చి 1: ఉట్నూర్ గిరిజన ప్రాంతంలోని బాలుర ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని తెలంగాణ పాల్‌టెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకర అక్షయ్ కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పాల్‌టెక్నిక్ విద్యార్థి జేఏసీ నాయకుడు శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బుడుందేవ్ జాతర

పూజలు చేస్తున్న భక్తులు

ఉట్నూర్ రూరల్, మార్చి 1: శ్యాంపూర్ గ్రామంలో బుడుందేవ్ జాతర కొనసాగుతున్నది. శుక్రవారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. బుడుందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో ఇంటికి అవసరమైన వస్తువులు, పిల్లలు ఆటవస్తువులు కొనుగోలు చేశారు. ఈ జాతరలో జిలేబీ ప్రత్యేకం. జాతరకు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పకుండా జిలేబీ తింటారు. ఈ జాతర మరో నాలుగు రోజులు కొనసాగనుంది.

## ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జడ్పీటీసీ గణేశ్ రెడ్డి

తాంసి(తలమడుగు), మార్చి 1: తలమడుగు మండలంలోని ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం తలమడగు మండలం ఉండం గ్రామంలో గ్రామస్తుల కృషితో దాతల సహకారంతో పురాతన మహాలక్ష్మీ మందిర స్థలంలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రమేశ్ రెడ్డి, వెంకన్న యాదవ్, గ్రామ పెద్దలు రాంచందర్ దేశ్‌ముఖ్, పోతయ్య, మైనార్టీ సెల్ రఫీక్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, మహేందర్, జగదీశ్ పాల్గొన్నారు.

## కళాశాల ప్రవేశ ప్రచార పోస్టర్ విడుదల

ప్రచార పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1 : తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రవేశ ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అన్ని సౌకర్యాలు ప్రతిభావంతులైన అధ్యాపకులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, టీజీసీజీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, నర్సింగరావ్, కళాశాల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు విజయ్‌కుమార్, రమేశ్, సంతోష్‌కుమార్, అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, రఘునాథ్, ప్రతాప్ సింగ్, తిరుపతి, అనిత, జ్యోత్స్న, రాజ్‌కుమార్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

ఉట్నూర్ రూరల్, మార్చి 1 : ఆదిలాబాద్ జిల్లా మామిడిగూడలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని తొడసం మహేశ్వరి అధికారుల నిర్లక్ష్యంతో అనారోగ్యంతో మృతి చెందిందని డీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేస్తూ, బాలిక మృతికి కారణమైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ డీడీ దిలీప్‌కు వినతిపత్రం ఇచ్చారు. లేనిపో ఆందోళ కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ కన్వీనర్ హరిప్రసాద్, నాయకులు శ్రీకాంత్, సాయిప్రసాద్, శ్యాం, అర్జున్, తిరుపతి, జంగు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, MANUBOTHULA RAJAIAH, S/o. Manubothula Yerraiah, R/o.1-33, Jaipur, Mancherial, TS. Changed My Name as MANUBOTHULA RAJ KIRAN, S/o. Manubothula Yerraiah all Records purpose. NT-319753

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# రిమ్స్ కార్మికుల నిరసన

రిమ్స్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎదులాపురం, మార్చి 1 : జిల్లా కేంద్రంలోని రిమ్స్, సూపర్ స్పెషాలిటీ దవాఖానలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెకు వెళ్తామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. రిమ్స్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు సంగీత, కార్మికులు ఇమ్రాన్‌ఖాన్, రాము, రాథోడ్ రవీందర్, రవి, సునీత, రాజేందర్‌సింగ్, శివకేశ్, స్వామి వెంకటేశ్, దత్తు, నర్సింగ్ పాల్గొన్నారు.

# డీఈవో వైఖరి మార్చుకోవాలి

ధర్నాలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1: ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారి అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. ఏఎస్‌వో నియామకంలో డీఈవో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ పట్టణంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అక్రమాలను సవరించుకొని నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన వ్యక్తిని ఏఎస్‌వోగా నియమించాలని కోరారు. ఇప్పటికైనా డీఈవో పద్ధతి మార్చుకొని, చేసిన తప్పును సవరించుకోవాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

తలమడుగులో వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాంసి(తలమడుగు), మార్చి 1: ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి ఈ నెల 3వ తేదీన పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు చేపట్టాలని తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావ్యవాణి అన్నారు. శుక్రవారం తాంసిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆదివారం నిర్వహించే పల్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే తలమడుగు మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కల్యాణలక్ష్మి, ఎంపీడీవో ఎస్ శేఖర్ అన్నారు. తలమడుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య సిబ్బంది, అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తలమడుగు తహసీల్దార్ రాజమోహన్, ఎంపీవో వినోద్, తాంసి హెల్త్ సూపర్‌వైజర్ రాథోడ్ తులసీరాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

ఉట్నూర్, మార్చి 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈనెల 12న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం కోసం జిల్లాస్థాయి పోటీలను ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 6*10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగుపందెం అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఉట్నూర్ బాలుర క్రీడాపాఠశాలలో 40, జాతర్లలోని బాలుర క్రీడాపాఠశాలలో 40, ఆసిఫాబాద్‌లోని క్రీడా పాఠశాలలో 40, బోయినపల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమిలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ 2013-2015 సంవత్సరాల మధ్యలో జన్మించిన గిరిజన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వీటితో పాటు 4, 5, 6, 7 తరగతులు చదువుతున్న గిరిజన బాల, బాలికలు ఆయా తేదీల్లో ఎలిజిబిలిటీ ఫారం, 2 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, బొనాఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో పాటు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ పోటీలను విజయవంతం చేయడానికి ఏటీడీవోలు, ఏసీఎంవోలు, స్పోర్ట్స్ అధికారులు, ఎస్సీఆర్పీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రైల్వే ఉద్యోగం చేస్తూనే.. అధ్యాపకుడిగా ఎంపిక

గేడం రాకేశ్

జైనథ్, మార్చి 1: మండలంలోని ఆకోలి గ్రామానికి చెందిన గేడం రాకేశ్ ఇటీవల గురుకుల ఫలితాలు విడుదల కావడంతో జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కెమెస్ట్రీ అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. గేడం రాస్పత- రేణుకబాయి దంపతుల కుమారుడు రాకేశ్ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ఆకోలిలో పూర్తి చేశాడు. పదో తరగతి, ఇంటర్మీడియట్ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకులంలో పూర్తి చేశాడు. పీజీ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఈ క్రమంలో మొదటగా రైల్వే ఉద్యోగాన్ని సాధించాడు. రైల్వేలో ఉద్యోగం చేస్తునే ఎలాగైన లెక్చరర్ ఉద్యోగం సాదించాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి చివరకు జూనియర్ లెక్చరర్ కొలువు కొట్టడంతో తన అన్న గేడం విఠల్‌తోపాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాకేశ్‌ను అభినందించారు.

## నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన యువతి

బోథ్, మార్చి 1: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సోనాలకు చెందిన బోయినపల్లి రాములు, లక్ష్మి దంపతుల మూడో కూతురు బోయినపల్లి జ్యోతి గురుకుల విద్యాల యాల ఫలితాల్లో సత్తా చాటింది. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీ ఎల్ ఉద్యోగాలన్నింటికీ ఎంపికైంది